


# నవభూమి
## మెదక్
అనుబంధం

06 సెప్టెంబర్,2024 శుక్రవారం పేజీలు:3

www.epaper.navabhoomi.in


### సిబ్బంది కొరత..
# ఖాతాదారుల ఇబ్బందులు



**బెజ్జంకి–నవభూమి :**మండల కేంద్రంలో మొట్టమొదట ఏర్పడిన బ్యాంక్ ఆంద్రా బ్యాంక్. కేంద్ర ప్రభుత్వ విధానాలతో ఆంద్రా బ్యాంక్..యూనియన్ బ్యాంకుగా మార్పు చెందింది. ఈ బ్యాంకులో సుమారు 10 వేల మంది ఖాతాదారులుంటారని సమాచారం. ఖాతాదారులకు అనుగణంగా సేవలందించడంలో బ్యాంక్ ఉద్యోగులు విఫలమవుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తున్నాయి.బ్యాంక్ ఉద్యోగులు సైతం నిబద్ధతతో సేవలందించకుండా బెదిరింపులకు పాల్పడుతున్నారని ఖాతాదారులు వాపోతున్నారు. బ్యాంక్ ఉద్యోగులు విస్మరించడం వల్లే మద్య దళారులను అశ్రయించాల్సిన దుస్థితి నెలకొందని ఖాతాదారులు అసహనం వ్యక్తం చేశారు.ఎన్నో ఎళ్లుగా ఖాతాదారులుగా ఉంటున్న ప్రజలను విస్మరించి ఒకరిద్దరు దళారులకు బ్యాంక్ ఉద్యోగులు అజ్యామిస్తున్నారని మండిపడుతున్నారు. ఇప్పటికైనా బ్యాంక్ ఉద్యోగులు దళారులకు ప్రాధాన్యత ఇవ్వండా నిబంధనల ప్రకారం ఖాతాదారులకు సేవలందించి బ్యాంక్ మనుగడను కాపాడుకోవాల్సిన బాధ్యత ఉందని పలువురు సూచిస్తున్నారు.

బాష సమస్యతో ఖాతాదారుల అవస్థలు..బ్యాంక్ మేనేజర్ గా బాధ్యతలూ నిర్వర్తిస్తున్న ఉద్యోగి ఇతర రాష్ట్రానికి చెందడంతో ఖాతాదారులు బాష సమస్యతో అవస్థలు పడుతున్నారు.దీంతో మేనేజర్ మాట్లాడే బాషకు అనుగుణంగా వ్యవహరించే మద్య దళారులదే హవా సాగుతోందని విమర్శలు తలెత్తున్నాయి.ఇప్పటికైనా మద్య దళారులకు అవకాశం లేకుండా ఉద్యోగులను కేటాయించాలని ఖాతాదారులు సంబంధిత బ్యాంక్ పై అధికారులను విజ్ఞప్తి చేశారు.

**బ్యాంకుల్లో దళారుల తిష్ట..**

గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో బ్యాంక్ ఉద్యోగులు ఖాతాదారులకు నిబద్దతో సేవలందించారు.కాంగ్రెస్ ప్రభుత్వ చేపట్టిన రుణమాఫీతో మద్య దళారులు బ్యాంకుల్లో తిష్ట వేస్తున్నారు.బ్యాంక్ ఉద్యోగుల తీరు మద్య దళారులకు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చుతుంది.ఇప్పటికైనా ఖాతాదారులకు ప్రయోజనం చేకూర్చేల బ్యాంక్ ఉద్యోగులు వ్యవహరిస్తే బాగుంటుంది.

### హరీశ్‌రావు పంపిన
# నిత్యావసరాలు అందజేత

**నంగునూరు–నవభూమి** : సిద్దిపేట నియోజకవర్గం హరీశ్‌రావు కుటుంబమని, ఆయన నాయకుడు కాదు.. సిద్దిపేట ప్రజల కుటుం బ సభ్యుడని, ప్రజా సేవకుడని.. కొంత మం ది విపత్తును కూడా రాజకీయం చేస్తున్నారని బీఆర్ఎస్ నాయకులు అన్నారు. అకాల వర్షానికి నంగునూరు మండలంలోని అక్కెనపల్లి బుడగ జంగాల కాలనీలో కొన్ని ఇం డ్లలోకి, గుడిసెలకు నీళ్లు రావడంతో అక్కడి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.దీంతో స్థానిక బీఆర్ఎస్ నాయకులు వారిని పరామర్శించి విషయాన్ని మాజీమంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే బీఆర్ఎస్ మండల నాయకులతో నిత్యావసర సరుకులు హరీశ్‌రావు పంపించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ..హరీశ్‌రావు కృషితోనే బుడగ జంగాల కాలనీలో గతంలో డ్రైనేజీ నిర్మించుకున్నామని, నేడు అకాల వర్షాలకు నష్టం జరగడం దురదృష్టకరం అన్నారు.కొంతమంది విపత్తును రాజకీ యం చేస్తూ పబ్బం గడుపుతున్నారని, నాడై నా, నేడైనా ఆపదలో ఆదుకునేది కేవలం హరీశ్‌రావు మాత్రమే అని అన్నారు. నష్టం జరిగిన వారి కుటుంబాలతోపాటు బుడగజంగాల కాలనీ వాసులకు మొత్తంగా 35 కు టుంబాలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు కోల రమేశ్‌గౌడ్, ఎల్లంకి మహిపాల్‌రెడ్డి, కిష్టారెడ్డి, సా రయ్య, తిరుపతి, వెంకటేశం పాల్గొన్నారు.



### వరద బాధితులకు
# బీఆర్ఎస్ విరాళం



**సిద్దిపేట–నవభూమి :** ఖమ్మం, మహబూబాబాద్ వరద బాధితుల కోసం బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నిర్ణయం మేరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎంపీలు ఒక నెల జీతం విరాళంగా ఇస్తున్నట్లు మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్ రావు ప్రకటించారు. సిద్దిపేట జిల్లా కేంద్రంలోని గాంధీ చౌరస్తాలో అమరనాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో పర్యావరణ హితం కోసం చేపట్టిన మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమంలో హరీశ్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగాఆయన మాట్లాడుతూ.. సిద్దిపేట కౌన్సిలర్లు కూడా ఒక నెల జీతం ఇవ్వాలని నిర్ణయించడం అభినందనీయమన్నారు. రేపు(శుక్రవారం) ఉదయం క్యాంప్ కార్యాలయం నుంచి దాతల సహాయంతో నిత్యావసర వస్తువులు, బట్టలు సుమారు 5, 6 లారీల్లో పంపించనున్నట్లు తెలిపారు. ఖమ్మంలో పర్యటిస్తున్నప్పుడు వారి ఇండ్లను చూస్తుంటే కన్నీళ్లు ఆగలేదని, కట్టుకున్న బట్టలు తప్ప ఏమీ మిగలలేదని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రోజుల నుంచి వారికి కరెంటు లేదని, తాగడానికి నీరు కూడా లేవన్నారు. ఇలాంటి సమయంలోనే మనిషికి మనిషి సహాయం చేయాలని, ఐఎంఏ వైద్యులు లక్ష రూపాయలు అందించారని, ఇతరులు కూడా సహాయం అందించాలని కోరారు. అమర్‌నాథ్ సేవా సమితి సేవలు దేశవ్యాప్తంగా వెళ్లాయని, వారిని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నా నన్నారు. ప్రకృతి కోసం మట్టి వినాయకులు పంచుతున్నారని, ప్రతి ఒక్కరూ ప్రకృతిని కాపాడాలని కోరారు. ప్రకృతిని ప్రేమిద్దాం, మట్టి వినాయకులను పూజిద్దాం అని అన్నారు. మానవ సేవయే మాధవ సేవ అని, ఆపదలో ఉన్న వారికి సేవ చేస్తే భగవంతునికి సేవ చేసినట్టేనని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ రాజనర్సు, అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి సభ్యులు పాల్గొన్నారు.

### పంట నష్టపోయిన
# రైతులను ఆదుకోవాలి

**నారాయణరావుపేట–నవభూమి :**పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. నారాయణరావుపేట మండలంలోని గోపులాపూర్‌లో తురకవాని కుంట తెగి రైతు దేవయ్యకు చెందిన 2 ఎకరాల పంట పొలం నష్టపోయింది. బుధవారం హరీశ్‌రావు రైతు పొలాన్ని పరిశీలించారు. ఆందోళన చెందవద్దని, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. తక్షణ సహాయం కింద రూ.10 వేలు అందజేశారు.మండలంలో గోపులాపూర్, మ ల్యాల, జక్కాపూర్ తదితర గ్రామాల్లో పంట నష్టం జరిగినట్లు తన దృష్టికి వచ్చిందని, మొత్తంగా నియోజకవర్గంలో 700 ఎకరా ల్లో పంట నష్టం జరిగినట్లు తెలిపారు. రెం డు కిలోమీటర్ల మేర బైక్‌పై, కిలోమీటర్ మేర పొలం గట్టుపై రైతుల వద్దకు వెళ్లి హరీశ్‌రావు భరోసా ఇచ్చారు. కష్టకాలంలో, ఆపదలో తమ దగ్గరకు వచ్చి అండగా ఉండి ఆర్థిక సహాయం అందించిన హరీశ్‌రావుకు రుణపడి ఉంటామని రైతు దేవయ్య సంతో షం వ్యక్తం చేశారు.



## శిథిల వ్యవస్థలో ఉన్న ఇంటిని కూల్చిన మున్సిపల్ చైర్మన్



**హుస్నాబాద్‌-నవభూమి :** ఇటీవల కురిసిన భారీ వర్షాలకు 20 వార్డులో శిథిలావస్థలో ఉన్న ఇంటిని గురువారం మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత, కమిషనర్ మల్లికార్జున్ జెసిబి సహాయంతో తొలగించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఆకుల రజిత మాట్లాడుతూ శిథిలావస్థలో ఉన్న ఇండ్లలో నివాస ఉన్న వారిని పునరావాస కేంద్రానికి తరలించి శిథిలమైన ఇళ్లను తొలగించడం జరుగుతుందని తెలిపారు. ప్రజలందరూ సహకరించగలరని కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ వాల సుప్రజా నవీన్ రావు , నాయకులు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంతమైన వాతావరణంలో పండుగలు నిర్వహించుకోవాలి

**హుస్నాబాద్‌-నవభూమి :** హిందువులు వినాయక చవితి, ముస్లింలు మిలాద్ ఉన్ నబీ పండుగలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని హుస్నాబాద్ సీఐ శ్రీనివాస్ అన్నారు. గురువారం హుస్నాబాద్ పోలీస్ స్టేషన్ లో హిందూ ముస్లిం మత పెద్దలు, మండపాల ఆర్గనైజర్లతో పెద్దలతో సీఐ శ్రీనివాస్, ఎస్ ఐ మహేష్ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ శ్రీనివాస్ మాట్లాడుతూ భిన్నత్వంలో ఏకత్వంలో అందరూ కలసి పండుగలు నిర్వహించుకోవాలన్నారు. జాతి మతం కులం వర్గం అనే బేధాలు లేకుండా అందరూ కలిసిమెలిసి ఉండాలని సూచించారు. హైదరాబాదులో మిలాద్ ఉన్ నబీ ఏరోజు జరుపుకుంటున్నారో ఆరోజు హుస్నాబాద్ లో జరుపుకోవాలని తెలిపారు. మతసామరస్యం కాపాడుకుంటూ పండగలు జరుపుకోవడం ఆచారంగా పెట్టుకోవాలని తెలిపారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్లో తెలియపరచాలని సూచించారు. ఈ మధ్యకాలంలో ఏ చిన్న సంఘటన జరిగినా చాలామంది సోషల్ మీడియాల ద్వారా వైరల్ చేయడం జరుగుతుందన్నారు. అలాంటి పరిణామాలు సమాజానికి మంచిది కాదని సూచించారు. అన్ని మతాలను కులాలను గౌరవించుకుంటూ సమాజంలో ముందుకు వెళ్లడం చాలా ముఖ్యమని తెలిపారు. యువతతో తల్లిదండ్రులు పెద్దలు కమ్యూనికేషన్ సత్సబంధాలు కలిగి ఉండాలని తెలిపారు. యువత ఆలోచన పెంచుకోని ఆవేశాన్ని తుంచాలని తెలిపారు . మైండ్ సెట్ మంచిగా ఉంటే మంచి ఆలోచనలు వస్తాయని తెలిపారు. ప్రతి ఒక్కరూ అభివృద్ధి సంక్షేమం గురించి పాటుపడాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చే మంచిని స్వీకరించాలని చెడును తీసివేయాలని సూచించారు. సోషల్ మీడియా యువత భావజాలాలకు అనుకూలంగా తీసుకోవాలని సూచించారు. సోషల్ మీడియాలో మతాలకు కులాలను రెచ్చగొట్టే విధంగా ఇతర మనోభావాలను దెబ్బతీసే విధంగా ఎవరైనా పోస్టులు చేసినా వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు . అట్లాంటివి కుల పెద్దలైన మీ దృష్టికి వస్తే వెంటనే పోలీసులకు తెలియపరచాలని సూచించారు. ఏ సమస్య ఉన్న డయల్ 100 కు కాల్ చేయాలని పేర్కొన్నారు.ఈ సమావేశంలో హిందూ మత పెద్దలు, కేడం లింగమూర్తి, బొలిశెట్టి శివయ్య, బత్తుల శంకర్ బాబు, రాము, అనంత స్వామి, రవీందర్ గౌడ్, మల్లికార్జున్ రెడ్డి, రమ, రజిత, ముస్లిం పెద్దలు అన్వర్, మమ్మద్ హసన్, మహమ్మద్ పాషా మియా, అంతేక్, షబ్బీర్, యంఏ భారీ, తదితరులు పాల్గొన్నారు.



# అలుగు పారుతున్న నల్లవాగు

**సంగారెడ్డి-నవభూమి :** వర్షాలకు జలవనరులు కళకళలాడుతున్నాయి. వరద వస్తుండడంతో సింగూరు ప్రాజెక్టు నీటిమట్టం 25.894 టీఎంసీలకు చేరుకుం ది. వరద ఇలాగే కొనసాగితే ఈ ప్రాజెక్టు నిండే అవకాశాలు ఉన్నాయి. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 29.917 టీఎంసీలు కాగా, మూడు నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టానికి చేరుకుంటున్నది. వారం క్రితం వరకు ప్రాజెక్టు నీటిమట్టం 14.612 టీఎంసీలు ఉండే, వర్షాకాలంలో సైతం ప్రాజెక్టులో నీటిమట్టం క్రమంగా తగ్గుముఖం పట్టడంతో రైతుల్లో ఆందోళన చెం దారు.ఐదురోజులుగా కురుస్తున్న వర్షాలకు సింగూరు ప్రా జెక్టులోకి భారీగా వరద వస్తున్నది. బుధవారం ప్రాజెక్టులోకి 46,604 క్యూసెక్కుల వరద వచ్చింది. దీంతో ప్రాజె క్టు నీటిమట్టం 25.420 టీఎంసీలకు చేరుకుంది. సింగూ రు ప్రాజెక్టు నిండితే సాగు, తాగునీటి కష్టాలు తీరనున్నా యి. జిల్లాలోని మరో ప్రాజెక్టు నల్లవాగు అలుగు పారుతోం ది. నల్లవాగు ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 0.746 టీఎంసీ కాగా, ప్రస్తుతం ప్రాజెక్టు పూర్తిగా నిండి అలుగు పారుతోంది.



**మత్తడి దుంకుతున్న చెరువులు**

వర్షాలతో సంగారెడ్డి జిల్లాలోని చెరువులు జలకళను సంతరించుకుంటున్నాయి. జిల్లాలో బుధవారం 2.8 సెం.మీట ర్ల సాధారణ వర్షపాతం నమోదైంది. సంగారెడ్డిలో అత్యధికంగా 6.5 సెం.మీటర్ల వర్షం కురిసింది. జిల్లాలోని 12 మండలాల్లో సాధారణం కంటే అధిక వర్షం కురవగా 13 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. వర్షాలతో జిల్లాలోని చెరువులు కుంటలు నిండుతున్నాయి. సంగారెడ్డి జిల్లాలో మొత్తం 1769 చెరువులు ఉండగా, 147 చెరువులు మత్తడి దూకుతున్నాయి. 373 చెరువులు పూర్తి గా నిండాయి. 309 చెరువులు 75 శాతం నీటితో నిండగా 820 చెరువులు 50 శాతం నీటితో నిండాయి. వర్షాలు మరి కొన్ని రోజులు కొనసాగితే జిల్లాలోని చెరువులు పూర్తి గా నీటితో నిండనున్నాయి.

# అభివృద్ధిని అడ్డుకుంటున్న కాంగ్రెస్

**సిద్దిపేట-నవభూమి :** కాంగ్రెస్ సర్కారు సిద్దిపేట అభివృద్ధిని అడ్డుకుంటున్నదని, ఈ ప్రాంతానికి మంజూరైన పలు పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి తన కొడంగల్ నియోజకవర్గానికి తరలించుకుపోయి అన్యాయం చేస్తున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు అన్నారు. బుధవారం సిద్దిపేటలో పలు కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కా ర్యాలయంలో 190మందికి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులను అందజేశారు. సిద్దిపేటలో అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.డెంగీ బాధిత కుటుంబాలను పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హరీశ్‌రావు మా ట్లాడుతూ..ఖమ్మం వరద బాధితులకు సహాయం చేద్దామని పోతే కాంగ్రెస్ నాయకులు దాడులకు పాల్పడడం తగదన్నారు. పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనలో సిద్దిపేట రూపురేఖలు మార్చుకున్నామన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి సిద్దిపేటకు మంజూరైన కాలేజీని కొడంగల్‌కు తరలించుకుపోయాడని విమర్శించారు. అవసరమైతే కొడంగల్‌కు నూతన కాలేజీని మంజూరు చేసుకోవాలని, సగంవరకు పనులు చేపట్టిన మన కాలేజీని గద్దలా తన్నుకుపోయాడన్నారు. కోమటి చెరువు వద్ద నిర్మిస్తున్న శిల్పారామం పనులను నిలిపివేశాడన్నారు. సిద్దిపేట అభివృద్ధికి ఊపిరి ఉన్నంత వరకు కృషి చేస్తానని హరీశ్‌రావు అన్నారు. సిద్దిపేటను విద్యాక్షేత్రంగా తీర్చిదిద్దానన్నారు.

**విరాళాలు అభినందనీయం**

ఖమ్మం వరద బాధితులను ఆదుకునేందుకు సిద్దిపేట అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి ముందుకు రావ డం అభినందనీయం అని హరీశ్‌రావు అన్నారు. వీరి ఆధ్వర్యంలో గురువారం ఉదయం లారీల్లో 500 నిత్యావసర గ్రాసరి కిట్లు, ఇతర సామన్లు ఖమ్మం తరలించనున్నట్లు తెలిపారు. సిద్దిపేట పట్టణ ఐఎంఏ తమ వంతు సహాయంగా రూ.లక్ష విరాళం అందజేసిందన్నా రు. సిద్దిపేటకు చెందిన చాలామంది వ్యాపారులు తమ వంతు సహాయంగా వస్తువులు, నిత్యావసర సరుకులు ఇవ్వడానికి ముందుకు వచ్చారన్నారు.సిద్దిపేటకు చెం దిన వ్యాపార వేత్త ఉప్పల కృష్ణమూర్తి రూ.11వేలు, సిద్దిపేట ధార్మిక ఉత్సవ సమితి రూ.25,116, మున్సిపల్ కమిషనర్ ఆశ్రిత్‌కుమార్ రూ.11వేలు, సిద్దిపేట మున్సిపల్ కౌన్సిలర్లు తమ నెల వేతనం వరద బాధితులకు ఇచ్చేందుకు ముందుకు వచ్చారన్నారు. ఆపద సమయంలో సేవ, సాయం చేయడానికి రాజకీయా లు వద్దన్నారు. ఎవరికి



వారు తోచిన విధంగా సహా యం అందించాలని మాజీమంత్రి హరీశ్‌రావు కోరారు.

**ఐఎంఏ వైద్యుల అండ**

ఖమ్మం వరద బాధితులను ఆదుకోవడానికి సిద్దిపేట ఐఎంఏ వై ద్యులు ముందుకు వచ్చి రూ.లక్ష చెక్కును ఎమ్మెల్యే హరీశ్‌రావుకు బుధవారం క్యాంప్ కార్యాలయం లో అందజేశారు. ఈ సందర్భంగా వారిని ఎమ్మెల్యే హరీశ్‌రావు అభినందించారు.ఈ కార్యక్రమంలో వైద్యులు భాస్కర్‌రావు, సతీష్, శ్రీనివాస్, రజనీకాంత్, సదానం దం తదితరులు పాల్గొన్నారు.

**మట్టి వినాయకులను పూజిద్దాం..**

సిద్దిపేట అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి ఆధ్వర్యం లో దేశవ్యాప్తంగా సేవలు అందించడం అభినందనీయమని ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. 13 ఏండ్లుగా అమర్‌నాథ్ యాత్రికులకు అన్నదానం చేస్తున్నారని తెలిపారు. పర్యావరణ పరిరక్షణ లక్ష్యంగా మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్నారన్నారు. అమర్‌నాథ్ అన్నదాన సేవా సమితి ఆధ్వర్యంలో 10 వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేశామన్నారు. సిద్దిపేట ఆధ్యాత్మిక కార్యక్రమాలకు నెలవు అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, అమర్‌నాథ్ అన్నదాన సేవాసమితి అధ్యక్షుడు కోర్తివాడ లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి నేతి కైలాసం, కోశాధికారి తిప్పరాజు మధుసూదన్, పీఆర్వో కుమ్మరికుంట రమేశ్, మీడియా ఇన్‌చార్జి గ్యాదరి పరమేశ్వర్, కౌన్సిలర్లు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

# మండలంలోని నలుగురు ఉత్తమ ఉపాధ్యాయులు

**తొగుట- నవభూమి :** మండలం నుండి జిల్లా ఉత్తమ ఉపాధ్యాయులు గా అవార్డు పొందరు. గురువారం గుడికందుల ఉన్నత పాఠశాల నుండి ఎల్. భిక్షపతి, వెంకట్రావు పేట ఉన్నత పాఠశాల నుండి మురళీధర్, యుపి ఎస్ పెద్ద మాసానిపల్లి దుర్గరెడ్డి, పిఎస్ వడ్డెర కాల నీ నుండి పి రామచంద్రా రెడ్డి లు ఉత్తమ ఉపాధ్యాయులుగా సన్మానం చేశారు.వారు మాట్లాడుతూ హర్నిశలు విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడుతున్న మండల పరధి లోని ప్రతి ఉపాధ్యాయినీ,ఉపాధ్యాయులకు ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు.



# పొంగిపొర్లుతున్న వాగులు, చెరువులు

**సంగారెడ్డి-నవభూమి :** సంగారెడ్డి జిల్లావ్యాప్తంగా శనివారం రాత్రి నుంచి ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా భారీ వర్షం కురిసింది. వాగులు, వంకలు పొంగిపొర్లుతుండగా, చెరువులు అలుగు దుంకుతున్నాయి. పత్తిపంట నీట మునిగి, పలు గ్రామాల్లో రోడ్లు దెబ్బతిన్నాయి. జిల్లాలో అత్యధికంగా వట్‌పల్లి మండలంలో 81.8 మి.మీ వర్షపాతం నమోదు కాగా.. అత్యల్పంగా కల్హేర్ మండలంలో 4.3 మి.మీ వర్షపాతం నమోదయింది. అందోలులో 79 మి.మీ., సిర్గాపూర్‌లో 71 మి.మీ., కంగ్టిలో 64.5 మి.మీ., మనూరులో 61 మి.మీ., నిజాంపేటలో 60.5 మి.మీ., నాగల్‌గిద్దలో 59.8 మి.మీ., సిర్గాపూర్ 55.3 మి.మీ., నారాయణఖేడ్‌లో 50.8 మి.మీ., జహీరాబాద్‌లో 48.5 మి.మీ., ఝరాసంగంలో 35 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.అందోలు మండలంలోని కిచ్చన్నపల్లి వద్ద పిట్లం నుంచి సంగారెడ్డి వస్తున్న సంగారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు వర్షానికి అదుపుతప్పి రోడ్డు పక్కనే పొలంలోకి జారిపోయింది. ఎవరికీ గాయాలు కాలేదు. అందోలు నుంచి సాయిబాన్‌పేట వెళ్లే దారిలో గూడెం వద్ద భారీ వృక్షం కూలిపోయి రోడ్డుపై పడిపోవడంతో రాకపోకలు నిలిచిపోయాయి.సంగారెడ్డిలోని మహబూబ్‌సాగర్ చెరువు గరిష్ట నీటి మట్టానికి చేరుకుని అలుగు పారుతున్నది. మండలంలోని ఈర్గిపల్లి గ్రామానికి వెళ్లే రహదారిపై అదుపు కారు పంటపొలాల్లోకి దూసుకెళ్లింది. పుల్‌కల్ మండలం సుల్తాన్‌పూర్ పెద్దచెరువు, చౌటకూర్‌లోని నాయిని చెరువు, శివంపేటలోని పెద్ద చెరువుతో పాటు కుంటల్లోకి నీరు చేరింది. నారాయణఖేడ్ పట్టణం, నియోజకవర్గంలోని పంచగామ, నిజాంపేట గ్రామాల్లో కొన్ని ఇళ్లు పాక్షింగా కూలిపోయాయి.సిర్గాపూర్ వాసర ఊర చెరువు నిండుకుండలా అలుగు పారుతున్నది. మునిపల్లి మండలం అంతరాం-చిన్న చల్మెడ గ్రామాల మధ్య



ఉన్న వాగు పొంగడంతో ఇరు గ్రామాల మధ్య రాకపోలు నిలిచిపోయాయి.రాయికోడ్-ధర్మారం గ్రామాల మధ్య బస్వన్నవాగు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. రాయికోడ్‌లోని ఓ కాలనీలో వర్షపు నీరు చేరి ప్రజలు ఇబ్బందులు పడ్డారు.కొండాపూర్ శివారులోని పెద్ద చెరువు నిండి రోడ్డుపై ప్రవహించడంతో తేర్పోలు, గొల్లపల్లి, మునిదేవునిపల్లి, గుంతపల్లి గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.ఝరాసంగం మండలం జీర్లపల్లి చెరువు అలుగు పారుతున్నది.ఝరాసంగం, కోహీర్, మునిపల్లి, నాగల్‌గిద్ద తదితర మండలాల్లో వందలాది ఎకరాల్లో పత్తి నీట మునిగింది.మునిపల్లి మండలం మేళసంఘంలో విద్యుత్ స్తంభాలు నేలకొరిగి విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. కంది శివారులోని 65వ జాతీయ రహదారి పక్కన హైటెన్షన్ విద్యుత్ స్తంభం నేలకొరిగింది.సదాశివపేట మండలం నందివాగు పొంగిపొర్లుతున్నది. మెల్గిరిపేట ప్రాజెక్టు నిండి గంగకత్వవాగు నిండుగా పారుతున్నది.

# కుండపోత

**మెదక్-నవభూమి :** ఏకధాటిగా కురిసిన వానతో మెదక్ జిల్లావాసులు తడిసిముద్దయ్యారు. గడిచిన 24 గంటల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు నమోదయ్యాయి. శనివారం ఉదయం నుంచి ఆదివారం సాయంత్రం వరకు మెదక్ జిల్లా రికార్డుస్థాయిలో వర్షపాతం నమోదైంది. ఈ సీజన్‌లోనే అత్యధికంగా గడిచిన 24 గంటల్లో మెదక్ మండలం పాతూర్‌లో 21 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రాజ్‌పల్లి 17.4సెం.మీ., మెదక్ 14.2సెం.మీ., నాగాపూర్ 13.5సెం.మీ., మిన్పూర్ 13.4 సెం.మీ., దామారంచ 13.1సెం.మీ., సర్ధన 13.0సెం.మీ., కొల్చారం 12.0సెం.మీ., కౌడిపల్లి 11.7సెం.మీ., కాగాజ్‌మాద్దుర్ 11.0 సెం.మీ.,టేక్మాల్, నర్సాపూర్ 10.5సెం.మీ., పెద్దశంకరంపేట 10.4సెం.మీ., రేగోడ్ 10 సెం.మీ., హావేళీఘణపూర్ 9.3 సెం.మీ., నిజాంపేట 8.14 సెం.మీ., కొల్చారం 8.0 సెం.మీ., రేగోడ్ 7.5 సెం.మీ., మెదక్ 7.2 సెం.మీ., పాపన్నపేట 7.1 సెం.మీ., చేగుంట 6.7 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న 24 గంటల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ సూచించింది.

**రాకపోకలకు అంతరాయం**

మెదక్ పట్టణంలోని చమన్- పోస్టాఫీస్ రోడ్డు జలమయం కావడంతో రాకపోకలు నిలిపివేశారు. నర్సాపూర్- హైదరాబాద్ రహదారిమధ్యలో పెద్ద వృక్షం నేల కూలి రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పోలీసులు తొలగించి దారి సరిచేశారు. హవేళీ ఘనపూర్ మండలం వాడి పంచాయతీ పరిధిలోని ధూప్‌సింగ్ తండాకు వెళ్లే రహదారిలో గల బ్రిడ్జిపై నుండి వరద నీరు ఉదృతంగా ప్రవహిస్తుండడంతో రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. హల్దీవాగు ఉదృతి పెరగడంతో తూప్రాన్ మండల కేంద్రం నుంచి కిష్టాపూర్, వెంకటాయపల్లి, నర్సంపల్లి గ్రామాలకు రకపోకలు నిలిచిపోయాయి.



నిజాంపేట మండలం చల్మెడ వాగు పొంగిపొర్లుతుండడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. నందిగామ సాయి చెరువు అలుగు పారడంతో రామాయంపేట-కాట్రియాల రహదారిపై వరద నీరు చేరి రాకపోకలు బంద్ అయ్యాయి. చిల్‌పచేడ్ మండల పరిధిలోని బందంబాయి వాగు పొంగి ఆప్రాంతమంతా జలమయమైంది. హకీంపేట హల్దీ ప్రాజక్ట్ పొంగిపొర్లుతోంది. కొల్చారం మండలం కొంగోడు వద్ద హల్ది వాగు పోంగి పోర్లుతుండటంతో మెదక్-కొంగోడు మధ్య రాకపోకలు నిలిచి పోయాయి. చేగుంటలోని ఎన్జీవో కాలనీలో ఇళ్ల మధ్యలో వర్షపునీరు నిలిచింది. పోచారం ప్రాజక్ట్‌లోకి భారీ స్థాయిలో నీరు ప్రవహిస్తుండడంతో జలకళ సంతరించుకుంది. రాయిన్‌పల్లి పాతూర్ మధ్యలో రహదారిపై వరదనీరు వచ్చి చేరడంతో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ ప్రవాహాన్ని పరిశీలించి అధికారులకు తగు సూచనలు చేశారు. మెదక్ మండలం రాయిన్‌పల్లి చెరువు అలుగు పారుతోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు జిల్లాలో 362 చెరువులు పూర్తిస్థాయిలో.. 1,860 చెరువులు సగం నిండాయి. 105 చెక్‌డ్యాములు అలుగు పారుతున్నాయి.

# జల నిర్బంధంలో కాచాపూర్ గ్రామం







**హుస్నాబాద్-నవభూమి :**రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కాచాపూర్ గ్రామం జల నిర్బంధంలో ఉందని ట్విన్ విలేజెస్ డెవలప్ మెంట్ ఫోరం కన్వీనర్ లింగంపల్లి అమర్ నాథ్ తెలిపారు.గత 50 సంవత్సరాల కాలంలో ఇలాంటి సంఘటనలు ఎప్పుడు జరగలేదన్నారు. గ్రామం చుట్టూ మూడు వైపులా వరద ఉధృతి ఎక్కువ అవ్వడంతో రాకపోకలు నిలిచిపోయాయన్నారు. గతంలో ఎన్ని సార్లు ఊరికి బ్రిడ్జి కమ్ రోడ్ సంక్షన్ అయినా ఇప్పటి వరకు ఏ ప్రభుత్వం పనులు చేపట్టిన దాఖలా లేదు. 2023 లో మా నియోజక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రస్తుత మంత్రి పొన్నం. ప్రభాకర్ ఎన్నికల హామీలో భాగంగా “ఏ అవసరం వచ్చినా అందుబాటులో వుంటానని” తెలిపారు. ఇప్పుడు ఆ హామీ నెరవేర్చే సమయం ఆసన్నమైందని గ్రామ ప్రజలు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన మోక్షం కలగలేదు. ఇప్పటికైనా రోడ్డు కమ్ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు

# మండలానికి రాష్ట్ర స్థాయి అభ్యుదయ రైతు పురస్కారం

**తొగుట-నవభూమి :**రాష్ట్ర స్థాయి అభ్యుదయ రైతు పురస్కారం రావ డం ఎంతో సంతోషంగా ఉందని రైతు దొడ్డ బాల స్వామి రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం యొక్క పదవ వార్షికోత్సవం సందర్భంగా ఏరువాక కేంద్రం ద్వారా రైతాంగానికి సలహాలు, సూచనలు అందజేస్తూ వ్యవసాయ రంగంలో విశేష కృషి చేసి మండలంలోని బండారు పల్లి (మెట్టు) గ్రామానికి చెందిన దొడ్డ బాలస్వామి రెడ్డి కి రాష్ర స్థాయి అభ్యుదయ రైతు పురస్కారం లభించింది. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 40 సంవత్సరాలుగా వ్యవసాయం చేస్తూ ఏరు వాక కేంద్రం, తోర్నాల వారి సూచనలతో పంటల వైవిధ్యీకరణ పాటిస్తూ పత్తి, కుసుమ, కంది, శనగ పంటలు పండించి అధిక దిగుబడి సాదించనట్లు పేర్కొన్నారు. పత్తి పంటలో గులాబీ రంగు పురుగు ఉధృతిని తగ్గించడానికి అధిక సాంద్రత పద్దతి అవ లంబించి పంటను పండించి, రబీలో పత్తి మొళ్లను కలియదున్ని కుసుమ పంటలు సాగు చేసి అధిక దిగుబడి పొందినట్లు చెప్పారు. విత్తనాలను నేరు గా మార్కెట్ లో అమ్మకుండా నూనెను పట్టించి లీటరుకు రూ. 400 చొప్పున విక్రయించి నికర ఆదయం పొందినట్లు తెలిపారు.



# పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

**దుబ్బాక-నవభూమి :** ప్రభుత్వం అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింత మహిళలు ,చిన్నారులకు సమతుల్య పోషకాహారాన్ని పంపిణీ చేస్తుందని ఈ అవకాశాన్ని గర్భిణీలు, బాలింతలు, చిన్నారులు సద్వినియోగం చేసుకోవాలని దుబ్బాక ఐసిడిఎస్ సూపర్వైజర్ రాజేశ్వరి అన్నారు. గురువారం దుబ్బాక మండల పరిధిలో పద్మనాభునిపల్లి అంగన్వాడి కేంద్రంలో పోషణ అభియాన్ (పోషణ మాసం) కార్యక్రమం గురించి గర్భిణీలు, బాలింతలకు వివరించారు. అనంతరం తక్కువ పిల్లలను గుర్తించి బాలామృతం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల్లో పంపిణీ చేసి బాలామృతంలో పిల్లలు ఎదుగుదలకు, బాలింతలు ,గర్భిణీలు ఆరోగ్యంగా ఉండేందుకు అనేక రకాల పోషకాహార పదార్థాలు అందులో ఇమిడి ఉన్నాయని తెలిపారు. ఐదు సంవత్సరాల చిన్నారులకు పౌష్టికాహారం అందించి సంపూర్ణ ఆరోగ్యవంతులను చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తుందని తెలిపారు. అంగన్వాడి కేంద్రాలను సద్వినియోగ చేసుకొని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించడానికి పాటుపడాలన్నారు.

